సాక్షి నిర్మల్

సోమవారం । 17 । జులై । 2023



సాగుబాటలో.. 8లో▸

వానాకాలం సాగుపనుల్లో జిల్లా రైతులు, కూలీలు నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా వ్యవసాయ క్షేత్రాల్లో పని చేస్తూ బిజీబిజీగా కనిపిస్తున్నారు.



పంచాయతీ కార్మికుల భిక్షాటన

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఆదివారం భిక్షాటన చేపట్టి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0 /24.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ముధోల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. గ్రామానికి చెందిన చిన్నారి జునైరా ఫాతిమా (6)కు డెంగీ నిర్ధారణ అయిందని తెలిపారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామపంచాయతీ సిబ్బంది ఆయా కాలనీల్లో బ్లీచింగ్‌పౌడర్ చల్లించి కాలువలను శుభ్రం చేయించారు. కాలనీలో ఇంటింటా తిరుగుతూ వివరాలు సేకరించారు. అనంతరం మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు. అనారోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎన్‌వీబీడీసీపీ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజారమేశ్, నిర్మల్ ఉప వైద్యాధికారి రాజేందర్, భైంసా డివిజన్ ఉప వైద్యాధికారి ఇద్రిస్ గోరి, వైద్యాధికారి ఆకాశ్, హెల్త్‌సూపర్‌వైజర్ దత్తురాం, ఇంతియాజ్, ఎంపీడీవో సురేశ్‌బాబు, గ్రామపంచాయతీ ఈవో పవన్, ఏఎన్‌ఎంలు జ్యోతి, విజయ, సిబ్బంది సుభాష్, ఆశ కార్యకర్తలున్నారు.

'కార్మిక గర్జన'ను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 4వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన కార్మిక గర్జనను జయప్రదం చేయాలని ఐఎఫ్ టీయూ రాష్ట్ర కార్యదర్శి కే రాజన్న కోరారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో కార్మిక గర్జన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ.. జిల్లాలోని కార్మికులు అధికసంఖ్యలో హాజరై కార్మిక గర్జనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్ రామలక్ష్మణ్, ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు కిషన్, కార్యదర్శి కే సాయన్న, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కే లక్ష్మి, ఆనంద్, లక్ష్మణ్, వర్మ, మునీర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నది వద్ద అనుమానాస్పదంగా మహిళ

- కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు



కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

భైంసా: గోదావరినది ఒడ్డున ఆదివారం ఓ మహిళ బిడ్డతోపాటు అటూఇటూ తిరుగుతూ అనుమానాస్పదంగా కనిపించగా ఓ యువకుడు 'డయల్ 100'కు కాల్ చేసి సమాచారం అందించాడు. బాసర పీఎస్ కానిస్టేబుల్ శ్రీను సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. మహిళతోపాటు ఆమె పాపను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఏఎస్సై ఉజ్వల మహిళతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిజామాబాద్ జిల్లా ధర్మారానికి చెందిన రోజాగా గుర్తించి వారి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఆరేళ్ల పాప ఆరాధ్యతో కలిసి నిజామాబాద్ నుంచి బాసర వరకు బస్సులో వచ్చిన ఆమె యంచ సమీపంలోని గోదావరినది వద్దకు వచ్చినట్లు గుర్తించారు. ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆమె భర్త శ్రీకాంత్, కుటుంబీకులతో మాట్లాడి పిలిపించారు. అనంతరం వారికి అప్పగించారు.

'కార్యకర్తలే పార్టీకి వెన్నెముక'



కార్యకర్తలతో టిఫిన్ బైఠక్‌లో రమాదేవి

భైంసాటౌన్: కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావుపటేల్, మోహన్‌రావుపటేల్ పేర్కొన్నారు. పార్టీ ఆదేశం మేరకు ఆదివారం వేర్వేరుగా టిఫిన్ బైఠక్ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని మాటేగాం టోల్‌ప్లాజా వద్ద జిల్లా అధ్యక్షురాలు ఆధ్వర్యంలో టిఫిన్ బాక్స్ తెచ్చుకుని పంక్తి భోజనం చేశారు. భైంసాలోని ఎస్‌ఎస్ కాటన్‌లో రామారావుపటేల్ ఆధ్వర్యంలో, మోహన్‌రావు పటేల్ కుభీర్ మండలంలో కార్యకర్తలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వారు మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కృషి చేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని తెలిపారు.

వయో'భారం'



సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

- అంగన్‌వాడీలకు రిటైర్డ్‌మెంట్ ఏది?
- 60 ఏళ్లు దాటినా ఇంకా విధుల్లోనే..
- అందని ఉద్యోగ విరమణ బెనిఫిట్స్
- జిల్లాలో 300మందికి పైగా సిబ్బంది

జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు	4
సెక్టార్లు	37
మెయిన్ కేంద్రాలు	816
మినీ కేంద్రాలు	110

ప్రాజెక్టుల వారీగా సిబ్బంది

ప్రాజెక్టు పేరు	మెయిన్ కేంద్రాలు	మినీ కేంద్రాలు	హెల్పర్లు
భైంసా	175	18	157
ఖానాపూర్	194	37	183
ముధోల్	154	18	125
నిర్మల్	252	26	205

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ఆరోగ్య సలహాలు, సూచనలు ఇస్తున్నారు. వారికి పౌష్టికాహారం అందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు వర్తింపజేస్తున్నారు. సామాజిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. శిశుమరణాల రేటు తగ్గించేందుకు కృషి చేస్తున్నారు. ఇవే కాకుండా ప్రభుత్వం ఇతర పనులకు అంగన్‌వాడీ టీచర్ల సేవలు వినియోగించుకుంటోంది. కాలానుగుణంగా సిబ్బంది జీతభత్యాలు, నిర్వహణలో మార్పులు వచ్చినా ఉద్యోగ విరమణ అంశంలో మాత్రం ఎలాంటి మార్పు తీసుకురాలేదు. 65 ఏళ్లు దాటినా టీచర్లు, ఆయాలు ఆర్థిక పరమైన అవసరాల దృష్ట్యా అవస్థలు పడుతూ విధులకు హాజరవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 60 ఏళ్లు దాటిన అంగన్‌వాడీ హెల్పర్లు, టీచర్లు సుమారు 300 మందికి పైగా ఉన్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లో..

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్లలో కొంతమంది ఉద్యోగ విరమణ వయస్సు దాటినవారున్నారు. రిటైర్మెంట్ అవకాశం లేక పోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న తమకు గౌరవప్రదమైన ఉద్యోగ విరమణ అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. స్వయంగా రిటైర్మెంట్ తీసుకోవాలనుకునే అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం గౌరవ పారితోషికంగా రూ.60 వేలు అందజేస్తోంది. హెల్పర్లకు రూ.30 వేలు ఇస్తోంది. అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నా భారంగా విధులకు హాజరవుతున్నారు. సీఎం కేసీఆర్ ఉద్యోగ విరమణ అవకాశం కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు. విరమణ సమయంలో రూ.10 లక్షలు చెల్లించాలని కోరుతున్నారు. పింఛన్ అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కనీస వేతనాలు చెల్లింపు, పింఛన్ సౌకర్యం, టీచర్లతో సమానంగా వేతనం, తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

నాలుగు ప్రాజెక్టుల్లో..

జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, భైంసా, ముధోల్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 926 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా సుమారు 300 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు 60 ఏళ్లు దాటినప్పటికీ విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం ఎప్పటికైనా గౌరవప్రదమైన విరమణ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించకపోతుందా? అని ఆశతో నిరీక్షిస్తున్నారు. రిటైర్మెంట్ అవకాశం లేకపోవడంతో విధులు నిర్వర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా టీచర్లుగా, ఆయాలుగా పనిచేస్తున్న వారు ఆర్థిక అవసరాల నేపథ్యంతో కొనసాగుతున్నారు. వీరికి రిటైర్మెంట్ అవకాశం కల్పిస్తే.. నిరుద్యోగ విద్యావంతులైన యువతులకు టీచర్లుగా, ఆయాలుగా ఉద్యోగావకాశాలు లభించే అవకాశం కూడా ఉంది.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి



చాలా ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్న. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ మాకూ ఇవ్వాలి. రిటైర్మెంట్ తర్వాత పింఛన్ ఇస్తే మా కుటుంబాలకు అన్ని విధాలా ఆసరాగా ఉంటుంది. అంగన్‌వాడీ టీచర్లతో ఆన్‌లైన్ పనులు చేయించొద్దు.

– విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్

అనారోగ్య సమస్యలతో ఇబ్బంది



నా వయస్సు 75 ఏళ్లు. అయినా నేటికీ అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పనిచేస్తున్న. అనారోగ్య సమస్యలున్నప్పటికీ విధులకు హాజరుకావాల్సి వస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా మాకు కూడా గౌరవప్రదమైన రిటైర్మెంట్ అవకాశం కల్పించాలి.

– నర్సవ్వ, అంగన్‌వాడీ హెల్పర్

32 ఏళ్లుగా పని చేస్తున్న



అంగన్‌వాడీ కేంద్రంలో 32 ఏళ్లుగా పని చేస్తున్న. ప్రభుత్వం ఇస్తున్న చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్నాం. మాకు కూడా ప్రభుత్వం అన్ని శాఖల ఉద్యోగుల మాదిరిగా రిటైర్మెంట్ ఫలాలు అందించాలి. ఇన్నేళ్లు పని చేసినందుకు మా కుటుంబాలకు అండగా ఉండాలి.

– బక్కవ్వ, అంగన్‌వాడీ హెల్పర్

'అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోగల సీఎంరావు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్‌లో 1995–96 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన 44 మంది పూర్వవిద్యార్థులంతా ఒక్కచోట చేరారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. రోజంతా సరదాగా గడిపారు. పాఠాలు బోధించిన అప్పటి ఉపాధ్యాయులు కల్వకుంట్ల నారాయణరావు, కరిపె రాజ్‌కుమార్, అంబటి గంగన్న, రజాక్‌బేగ్‌ను ఆహ్వానించి శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకులు డీ రాజేశ్, పవన్, శేఖర్, భారతి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎస్సైలకు సన్మానం



సాధిక్‌హుస్సేన్, గణేశ్‌ను సన్మానిస్తున్న ఏఎస్పీ

భైంసాటౌన్: భైంసా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సైలు సాధిక్ హుస్సేన్, గణేశ్ నిజామాబాద్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆదివారం వీరిని ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, సీఐ ఎల్.శ్రీను శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

సాంకేతికతను ఉపయోగించుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న గంగారెడ్డి

సోన్: నేర పరిశోధనలో సాంకేతికతను ఉపయోగించుకోవాలని సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ అల్లూరి గంగారెడ్డి సూచించారు. ఆదివారం సోన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తంజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూ శాంతి భద్రతలను పరిరక్షించాలని సూచించారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై రవీందర్, సిబ్బంది ఉన్నారు.

గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ముధోల్: గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతకుంట గ్రామంలో రూ.36లక్షలతో గోదాం, రూ.20లక్షలతో గ్రామపంచాయతీ భవనం, బోరేగాంలో రూ.80లక్షలతో గోదాం నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకే రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని చెప్పారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సాగరాబాయి రాజన్న, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గంగాచరణ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి, వైస్ ఎంపీపీ లావణ్య–రవీందర్, సర్పంచులు రాజేందర్‌రెడ్డి, అమృత, మురళి, నాయకులు నారాయణ్‌రావుపటేల్, దేవేందర్‌రెడ్డి, సుధాకర్ తదితరులున్నారు.





రిసార్ట్స్ 'హరిత'మయం

కడెం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్ సందర్శకులకు ఆహ్లాదం పంచుతోంది. విడిది గదులకు వెళ్లే మార్గంలో ఇరువైపులా పచ్చని మొక్కలు ఆహ్వానం పలుకుతున్నాయి. ఫుట్‌పాత్ పక్కన వెదురు బొంగుల కంచె ఆకట్టుకుంటోంది. పర్యాటకులకు ఆనందంతోపాటు ఆహ్లాదం పంచేందుకు రిసార్ట్స్‌ను తీర్చిదిద్దుతున్నట్లు ఇన్‌చార్జి మేనేజర్ తిరుపతి పేర్కొన్నారు. - కడెం



బోనమెత్తిన ఊరూవాడ

నిర్మల్‌లోని మహాలక్ష్మీ ఆలయంలో క్యూలైన్‌లో బోనాలతో భక్తులు



భైంసా: ట్రిపుల్‌ఐటీలో..



నిర్మల్‌లో అమ్మవారికి కోడితో మొక్కు తీర్చుకుంటున్న భక్తుడు

ఆషాఢం చివరి ఆదివారం కావడంతో జిల్లాలో ఊరూవాడ బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు బోనాలు నెత్తినెత్తుకుని అమ్మవార్ల ఆలయాలకు డప్పుచప్పుళ్లు, పోతురాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. పిల్లాపాపలు, గొడ్డుగోద, పాడిపంటలను చల్లగా చూడాలని అమ్మవార్లను వేడుకున్నారు.

- వివరాలు లోపలి పేజీల్లో..

మృతదేహం వెంటే మృత్యు ఒడికి..



రోదిస్తూ చిన్నారుల తల్లిదండ్రులకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబీకులు

- క్షణికావేశంలో పురుగుల మందు తాగిన భార్య
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి
- మృతదేహాన్ని తీసుకెళ్తుండగా భర్తను ఢీకొట్టిన లారీ
- రెండు గంటల వ్యవధిలో దంపతుల మృత్యువాత
- అనాథలైన ఇద్దరు చిన్నారులు

లక్సెట్టిపేట: కడవరకూ తోడుంటానని పెళ్లిలో చేసిన ప్రమాణాన్ని దేవుడు నిజం చేయాలనుకున్నాడో ఏమో.. పిల్లలు చిన్నవారన్న దయ కూడా చూపలేదు. భార్య చనిపోయిందని పుట్టెడు దుఃఖంలో ఆమె మృతదేహం వెంటే స్వగ్రామానికి బయల్దేరాడు భర్త. తెల్లవారితే పిల్లలకు అమ్మ ఏదంటే ఏమని సమాధానం చెప్పాలని ఉబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకొంటూ.. తనలోని బాధ పిల్లలకు కనిపించకూడదన్న ఆలోచనలో ఉన్నాడు. ఇంతలోనే మృత్యువు వెంటాడింది. భార్య చనిపోయిన రెండు గంటల వ్యవధిలోనే లారీ రూపంలో అతడిని కబళించింది. ఈ విషాద సంఘటన మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలంలో చోటు చేసుకుంది. తల్లిదండ్రుల మరణంతో పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. ఈ ఘటనతో మండలంలోని ఎల్లారం గ్రామంలో విషాదం అలుముకుంది.

చిచ్చుపెట్టిన పొరుగింటి గొడవ..

డ్రైవర్‌గా పనిచేసే భర్త, బంగారం లాంటి ఇద్దరు పిల్లలతో హాయిగా సాగిపోతున్న ఆమె జీవితంలో పొరుగింటి వారితో జరిగిన గొడవ చిచ్చు పెట్టింది. చివరకు దంపతులిద్దరి మరణానికి కారణమైంది. లక్సెట్టిపేట ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన శరణ్య(28) గృహిణి. ఆమె భర్త మల్లికార్జున్(33) ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఓంకార్, ఇవాంక సంతానం. సాఫీగా సాగుతున్న వీరి కుటుంబంలో ఒక్కసారిగా పెను విషాదం నెలకొంది. కొద్ది రోజుల క్రితం ఇంటి పక్కన ఉండే రజినితో శరణ్యకు గొడవ జరిగింది. ఇరుగుపొరుగు వారు వచ్చి ఇద్దరికీ నచ్చజెప్పారు. ఇంతలో మరో మహిళ రాణి కూడా ఈ గొడవలో జోక్యం చేసుకుంది. రజినిని రెచ్చగొట్టి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శరణ్యపై ఫిర్యాదు చేయించింది.

మనస్తాపంతో పురుగుల మందు తాగి..

ఈ విషయం తెలిసిన శరణ్య మనస్తాపం చెందింది. చేయని తప్పుకు తనపై పోలీసులకు ఫిర్యాదు చేశారని మదనపడింది. క్షణికావేశంలో ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శరణ్య శనివారం రాత్రి 11 గంటలకు మృతిచెందింది. కోలుకుని ఇంటికి వస్తుందనుకున్న భార్య కానరాని లోకాలకు వెళ్లడంతో మల్లికార్జున్ కన్నీటిపర్యంతమయ్యాడు. అనంతరం తేరుకుని మృతదేహాన్ని స్వగ్రామం తరలించేందుకు బంధువు సాయంతో అంబులెన్స్ ఏర్పాటు చేశాడు.

రెండు గంటల వ్యవధిలో ఇద్దరు మృతి..



వాహనంలో భార్యాభర్తల మృతదేహాలు

రెండు గంటల వ్యవధిలో భార్య శరణ్య, భర్త మల్లికార్జున్ మృత్యువాత పడడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. తల్లి మరణంతో పిల్లల గురించి ఆలోచిస్తూ వెళ్లిన తాను కూడా పిల్లలను చూడకుండానే దుర్మరణం చెందడంతో బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇద్దరి మృతదేహాలకు లక్సెట్టిపేట ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామానికి తీసుకెళ్లారు. అమ్మా, నాన్న ఇద్దరినీ విగత జీవులుగా చూసిన పిల్లలు బోరున విలపించడం అందరినీ కలచివేసింది. సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

అంబులెన్స్ వెనకాలే.. ద్విచక్రవాహనంపై..

అమ్మ త్వరలోనే ఇంటికి వస్తుందని రాత్రి పడుకునే ముందే పిల్లలకు చెప్పాడు మల్లికార్జున్. ఇంతలో శరణ్య మరణించడంతో తెల్లవారి పిల్లలకు ఏం చెప్పాలని దుఃఖాన్ని దిగమింగుతూ తన ద్విచక్రవాహనంపై బంధువుతో కలిసి అంబులెన్స్ వెనకాలే గ్రామానికి బయల్దేరాడు. పిల్లలు రేపటి నుంచి ఎవరిని 'అమ్మా..' అని పిలుస్తారని కన్నీరు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో లక్సెట్టిపేటలోని ఎన్టీఆర్ చౌరస్తాకు చేరుకున్నారు. మూత్రవిసర్జన కోసం అక్కడ ఆగారు. ద్విచక్రవాహనం రోడ్డు పక్కన నిలిపారు. మల్లికార్జున్ రోడ్డు దాటుతుండగా రాయపట్నం నుంచి లక్సెట్టిపేట వైపునకు వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే ఉన్న బంధువు వెంటనే పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు.